సాక్షి శ్రీకాకుళం

గురువారం । 26 । జూన్ । 2025



ప్రారంభమెన్నడో..!
వైఎస్సార్‌సీపీ హయాంలో పూర్తయిన జిల్లా ఔషధ నియంత్రణ పరిపాలన కార్యాలయం ప్రారంభానికి నోచుకోవడం లేదు. - 8లో



విత్తన శుద్ధి.. సాగు వృద్ధి
వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఖరీఫ్‌కు సిద్ధమవుతున్నారు. విత్తన శుద్ధి విధిగా చేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. - 8లో



రాజకీయ కక్ష సాధింపు..?
కూటమి ప్రభుత్వంలో రాజకీయ కక్ష సాధింపులు కొనసాగుతున్నాయి. కోమర్తిలో సర్పంచ్ బంధువుల రేకుల షెడ్డు, గడ్డికుప్పను అధికారులు తొలగించారు. - 8లో



నగర నేతల పులిజూదం

టీడీపీలో అంతర్గత కుట్రలు

- ఆధిపత్యం కోసం ఒకరినొకరు టార్గెట్ చేసుకుంటున్న వైనం
- బలహీనతలపై గురిపెట్టి దెబ్బకొడుతున్న ప్రత్యర్థులు
- పదవుల రేసు నుంచి ఎలిమినేట్ చేసేందుకు ఎత్తుగడలు
- దానేటి శ్రీధర్ తరహాలోనే పాండ్రంకి శంకర్ లక్ష్యంగా పథక రచన
- ఆసక్తికరంగా మారిన నగర అధ్యక్ష పదవి వ్యవహారం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జూదం ఆడటం తప్పు. పేకాట శిబిరాలు నిర్వహించడం అంతకుమించి తప్పు. శ్రీకాకుళంలోనే కాదు జిల్లా వ్యాప్తంగా పేకాట శిబిరాలు నడుస్తున్నాయి. స్వయంగా కూటమి నాయకులే నిర్వహిస్తున్న ఈ శిబిరాల్లో పెద్ద పెద్ద వ్యక్తులు జూదమాడుతున్నారు. ఇప్పుడీ బలహీనతలే కొంతమందిని రోడ్డుపైకి తీసుకొస్తున్నాయి. దానివెనక రాజకీయ కుట్రలు ఉంటున్నాయి. ఎవరినైతే పదవుల విషయంలో ఎలిమినేట్ చేయాలనుకుని భావిస్తున్నారో వారిని వ్యూహాత్మకంగా బుక్ చేస్తున్నారు. ఆ మధ్య ప్రముఖ వైద్యుడు దానేటి శ్రీధర్‌ను, తాజాగా పాండ్రంకి శంకర్ బ్రదర్స్‌ను అదే రకంగా దెబ్బకొట్టారని కూటమి నాయకుల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

దానేటి శ్రీధర్‌ను రచ్చకీడ్చేలా..

ఆ మధ్య కుశాలపురం సమీపంలో దానేటి శ్రీధర్ గెస్ట్ హౌస్‌లో పేకాట జరుగుతున్నట్టుగా పోలీసులకు సమాచారం వెళ్లింది. స్పెషల్ బ్రాంచ్, ఎచ్చెర్ల పోలీసులు ఓ రాత్రి దాడి చేసి, ఆరుగురు వ్యక్తుల్ని పట్టుకున్నారు. అప్పట్లో దొరికిన వారిలో దానేటి శ్రీధర్ కూడా ఉన్నట్టు బయట ప్రచారం జరిగింది. పోలీసుల దాడులు, పట్టుకున్న విషయమంతా బయటికి వచ్చేలా తెరవెనక కొందరు కథ నడిపించారు. ఆ తర్వాత అదే కూటమి పెద్దల పలుకుబడితో దానేటి శ్రీధర్‌ను సేఫ్ చేసినట్టు రక్తికట్టించారు. ఆయన గెస్ట్‌హౌస్‌లో పేకాట జరిగిందని.. శ్రీధర్ లేరని క్లారిటీ ఇచ్చేశారు. మొత్తానికి దానేటి శ్రీధర్ పరువు అధికారికంగా పోలేదు. ఎందుకిలా చేశారంటే జనసేన నాయకుడిగా డాక్టర్ దానేటి శ్రీధర్ రాజకీయంగా పోటీ పడుతున్నారు. జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో భవిష్యత్‌లో పదవి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఒక ముద్ర వేసి వీధిన పెట్టేస్తే.. పదవుల విషయంలో పోటీ ఉండటానికి అవకాశం ఉండదని కూటమిలోనే ప్రత్యర్థులే కుట్రపూరితంగా వ్యవహరించారన్న వాదనలు నడిచాయి. పథకం ప్రకారం పట్టుకునేలా చేసి..



దొరికాక పట్టుబడ్డ వారి పేర్లలో డాక్టర్ పేరు తప్పించేందుకు శరణు కోరేలా చేశారనే ప్రచారం జరిగింది. అనుకున్నట్టే.. ఎన్నికల ముందు హడావుడిగా కన్పించిన దానేటి శ్రీధర్ తర్వాత పదవుల విషయంలో పోటీపడ్డ పరిస్థితులు కన్పించలేదు. అందుకు తగ్గట్టుగానే ఆయనకు ఏ పదవీ రాలేదు.

తాజాగా పాండ్రంకి శంకర్ బ్రదర్స్..

శ్రీకాకుళం నగర టీడీపీలో ప్రముఖ నాయకులుగా పాండ్రంకి శంకర్ బ్రదర్స్ ఉన్నారు. పట్టణ టీడీపీ అధ్యక్ష పదవిని శంకర్ ఆశిస్తున్నారు. దాదాపు వారికే ఖరారు అవుతుందన్న ప్రచారం కూడా జరుగుతోంది. ఈ సమయంలో ఆ పార్టీలో వారే టార్గెట్ చేసి దెబ్బకొట్టారన్న ప్రచారం నడుస్తోంది. ఆయనకున్న పేకాట బలహీనతపై గురి పెట్టి అదను చూసి కొట్టారు. జిల్లా కేంద్రంలోని టౌన్ హాల్ సమీపంలో ఉన్న పాండ్రంకి శంకర్ అపార్ట్‌మెంట్‌లో పేకాడుతూ పలువురు పట్టుబడ్డారు. వారిలో పాండ్రంకి శంకర్, ఆయన సోదరుడు దేవేంద్రనాయుడు, ఆమదావలస టీడీపీ నాయకుడు పరధామ విజయ్ రామ్‌తో పాటు మరొకరు ఉన్నారు. పార్టీలోని ప్రత్యర్థులే అక్కడ పేకాట ఆడుతున్న సమాచారమిచ్చి పట్టించారన్న వాదనలు ఉన్నాయి. పేకాటలో దొరికిపోయే వ్యక్తికి పట్టణ అధ్యక్ష పదవి ఇస్తే ఇబ్బందికరమన్న సమీకరణాలు తెచ్చి ఎలిమినేట్ చేయడమే అంతర్గత ప్రత్యర్థుల వ్యూహమని తెలుస్తోంది. సోదరుడు దేవేంద్రనాయుడుకు నగరంలోని ఓ దేవాలయం ట్రస్టుబోర్డు చైర్మన్ ఇస్తారన్న ప్రచారం నేపథ్యంలో అతన్ని కూడా టార్గెట్ చేసినట్టు తెలిసింది.

రేసులో అర డజనుకు పైగా..

అధికారంలో ఉండటంతో నగర అధ్యక్ష పదవి కోసం టీడీపీలో పోటీ ఎక్కువైంది. అధికారిక పదవి కాకపోయినా పార్టీ పదవితో చక్రం తిప్పొచ్చన్న ఉద్దేశంతో అధ్యక్ష పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుత నగర పార్టీ అధ్యక్షుడు మాదారావు వెంకటేష్, ఎన్నికల ముందు టీడీపీలో చేరిన అంధవరపు సంతోష్, తాజాగా పేకాటలో పట్టుబడ్డ పాండ్రంకి శంకర్, కోరాడ హరిగోపాల్, ఉంగటి వెంకట రమణ, గిరిజా శంకర్, ఇప్పిలి తిరుమల రావు రేసులో ఉన్నట్లు చర్చ జరుగుతోంది. మళ్లీ తనకే వస్తుందని మాదారావు వెంకటేష్ ధీమాగా ఉన్నా.. ఎన్నికలకు ముందు ప్రస్తుత ఎమ్మెల్యే గొండు శంకర్‌తో స్థానిక రెల్లి వీధి దగ్గర ప్రధాన రహదారిలో గొడవ పడ్డారు. ఆ ఘటన గొండు శంకర్‌కు ఘోర అవమానంగానే చెప్పవచ్చు. తర్వాత ఎమ్మెల్యేతో సన్నిహితంగా ఉంటున్నా.. గతాన్ని గుర్తు చేసుకుని వెంకటేష్‌ను పక్కన పెట్టడానికి అవకాశాలు ఉన్నాయి. ఇక, పాండ్రంకి శంకర్‌కు ఎమ్మెల్యేతో సత్సంబంధాలు ఉండటంతో దాదాపు ఆయనకే ఖరారు అవుతుందన్న ప్రచారం ఉంది. వరం ఫ్యామిలీ కూడా ప్రస్తుతానికి కార్పొరేషన్ ఎన్నికలు లేకపోవడంతో కనీసం పట్టణ అధ్యక్ష పదవి వస్తుందేమో అన్న ఆశతో ఉన్నారు. ఇక, సీనియర్ నాయకులుగా ఉన్న కోరాడ హరిగోపాల్, ఉంగటి వెంకట రమణ, గిరిజా శంకర్, ఇప్పిలి తిరుపతిరావు వంటి తమదైన శైలిలో ప్రయత్నిస్తున్నారు.

అదును చూసి..

రేసులో ఉన్న వారికి మంత్రులు, ఎమ్మెల్యే అండ ఎవరికి ఉందో తెలియదు గాని పాండ్రంకి శంకర్‌ను మాత్రం అదును చూసి పేకాట బాగోతంలో పట్టుబడేలా చేశారు. వాస్తవంగా నగరంలో అనేక చోట్ల పేకాట శిబిరాలు నడుస్తున్నాయి. ఆడుతున్న వారిలో టీడీపీ ప్రముఖులతో పాటు ఇతర ప్రముఖులు ఉన్నారు. గూనపాలెంకు చెందిన ఓ నాయకుడు ఆధ్వర్యంలో, మహిళా కళాశాల రోడ్డులో ఒక అపార్ట్‌మెంట్‌లో ఎన్నికల ముందు టీడీపీలో చేరిన వారి ఆధ్వర్యంలో, మరికొన్నిచోట్ల పేకాట శిబిరాలు నడుస్తున్నాయి. వారంతా పకడ్బందీగా శిబిరాలు నిర్వహిస్తున్నారు.

న్యూస్‌రీల్

జనావాసాల్లోకి జింక



జింకను పట్టుకున్న అటవీ అధికారులు

సరుబుజ్జిలి: అటవీ ప్రాంతం కుచించుకుపోవడంతో జంతువులు మైదాన ప్రాంతాల బాటపడుతున్నాయి. బుధవారం సరుబుజ్జిలి మండలం మర్రిపాడు గ్రామం వైపు జింక రావడంతో స్థానిక వ్యక్తి వెంబడించాడు. దీంతో సమీపంలోని సవళాపురం జంక్షన్ వద్ద బురిడివలస కాలనీలో ఓ ఇంట్లోకి చొరబడింది. సమాచారం అందుకున్న అటవీసెక్షన్ అధికారి సాయిరాం సిబ్బందితో వచ్చి జింకను చాకచక్యంగా పట్టుకున్నారు. అనంతరం సీతంపేట మండలం ఓంద్రుజ్వాల వద్ద విడిచిపెట్టారు.

కలెక్టర్‌ను కలిసిన ఎల్‌డీఎం



కలెక్టర్‌కు మొక్కను బహూకరిస్తున్న ఎల్‌డీఎం శ్రీనివాసరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎం.శ్రీనివాసరావు బుధవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో మాట్లాడుతూ లక్ష్యాలను చేరుకుని రైతులకు,ప్రజలకు సకాలంలో రుణాల అందిస్తామని తెలిపారు.

నేడు జిల్లాస్థాయి ఫెన్సింగ్ ఎంపిక పోటీలు



శ్రీకాకుళం న్యూకాలనీ : జిల్లా స్థాయి చైల్డ్ అండ్ మినీ ఫెన్సింగ్ ఎంపిక పోటీలు గురువారం నిర్వహిస్తున్నట్టు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం టౌన్ హాల్ వేదికగా అండర్–10, అండర్–12 విభాగాలలో బాలురు, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులను ఈ నెల 29న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే ఏపీ రాష్ట్రస్థాయి పోటీలకి పంపిస్తామన్నారు. వ్యక్తిగత ఫెన్సింగ్ కిట్, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు ఫెన్సింగ్ ఎన్ఐఎస్ కోచ్ జోగిపాటి వంశీ(సెల్: 7660874844)ను సంప్రదించాలని కోరారు.

పీజీ సెట్ ఫలితాల్లో టెక్కలి విద్యార్థికి ఫస్ట్ ర్యాంక్



తల్లిదండ్రులతో హారిక

టెక్కలి: రాష్ట్రవ్యాప్తంగా బుధవారం విడుదలైన పీజీ సెట్ ఫలితాల్లో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన తియాలు హారిక బోటనీ విభాగంలో మొదటి ర్యాంకు సాధించింది. ఒడిశా పర్లాకిమిడి సమీపంలో రామసాగరం గ్రామానికి చెందిన ధనుంజయరావు, శాంతి దంపతుల కుమార్తె హారిక టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇటీవలే డిగ్రీ పూర్తి చేసింది. తాజాగా వెలువడిన ఫలితాల్లో మొదటి ర్యాంకు రావడం పట్ల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, అధ్యాపకుడు డి.వాసుబాబు, కళాశాల సిబ్బంది అభినందించారు.

కిడ్నీ ఆస్పత్రిలో అసౌకర్యాలపై ఆరా



నిరుపయోగంగా ఉన్న సిటీ స్కాన్ యంత్రాన్ని పరిశీలిస్తున్న అజశర్మ, వేదిక సభ్యులు

కాశీబుగ్గ: పలాస కిడ్నీ ఆసుపత్రిలో పూర్తి స్థాయిలోని వైద్యులు, సిబ్బందిని నియమించాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ డిమాండ్ చేశారు. పలాస కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల ఆసుపత్రిని బుధవారం వేదిక సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 మంది డాక్టర్లకు గాను 20 మందిని మాత్రమే నియమించడం రోగులకు ఎలా సేవలు అందుతాయని ప్రశ్నించారు. 60 మంది నర్సులకు 58 మంది కాంట్రాక్టు పద్ధతిలోనే ఉన్నారని, శాశ్వత నర్సులను ఎందుకు నియమించడం లేదో ప్రభుత్వం సమాధానమివ్వాలన్నారు. రీసెర్చ్ పూర్తి స్థాయిలో జరగడం లేదన్నారు. రోజు రోజుకు కిడ్నీ రోగుల సంఖ్య, మరణాలు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కార్యదర్శి టి.కామేశ్వరరావు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక నాయకులు ధర్మారావు మాస్టారు, అజయ్ కుమార్, రైతు సంఘం అధ్యక్షుడు మోహనరావు, సీఐటీయూ నాయకులు గణపతి, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో స్పెషల్ బీఈడీ (ఎంఆర్) కోర్సుకు సంబంధించిన మూడో సెమిస్టర్ ఫలితాలను వర్సిటీ ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ ఉదయ్ భాస్కర్ బుధవారం విడుదల చేశారు. 33 మంది హాజరుకాగా శతశాతం ఉత్తీర్ణత సాధించారు. దీంతో పాటు బొల్లినేని మెడిస్కిల్స్ సంస్థ, వర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న పీజీ, డిప్లమా మెడికల్ కోర్సుల సెమిస్టర్ ఫలితాలను కూడా విడుదల చేశారు. మాస్టర్ ఆఫ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్‌లో ఒకటో సెమిస్టర్‌కు 30, మూడో సెమిస్టర్‌కు 31 మంది పరీక్షకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. పీజీ డిప్లమో ఇన్ మెడికల్ రికార్డ్స్ అండ్ హాస్పిటల్ ఇన్ఫర్మేషన్ కోర్సులో ఒకటో సెమిస్టర్‌కు 19 మంది హాజరై శతశాతం ఉత్తీర్ణులయ్యారు.



నిరసన పర్వం

పదోన్నతులు కల్పించి, జాబ్‌చార్టులు కేటాయించి, సర్వీస్ రూల్స్ అమలు చేశాకే బదిలీలు చేపట్టాలంటూ గ్రామ సచివాలయాల సిబ్బంది బుధవారం నరసన్నపేట ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం ఎంపీడీఓ వెంకటేశ్వర ప్రసాద్, తహసీల్దార్ సత్యనారాయణలకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు శిమ్మ రామచంద్రరావు, చింతు రేవతి, ప్రశాంత్, బాను ప్రసాద్ మాట్లాడుతూ సొంత మండలాల్లోనే పనిచేసేలా అవకాశం ఇవ్వాలని కోరారు. – నరసన్నపేట



నేత్రోత్సవం

ఇచ్ఛాపురం పట్టణంలోని జగన్నాథుని ఆలయ ఆవరణలో ఉత్కలాంధ్రుల ఆరాధ్య దైవం జగన్నాథస్వామి నేత్రోత్సవం బుధవారం కనుల పండువగా జరిగింది. 15 రోజులుగా చీకటి గదికే పరిమితమైన స్వామివార్లకు సహజసిద్ధమైన వర్ణాలు, చెట్ల నుంచి సేకరించిన పసర్లు, జిగుర్లు, పుష్పాలు, కొన్ని రకాల పిండి పదార్థాలు, సుగంధ ద్రవ్యాలను ఉపయోగించి సపర్యలు చేయడంతో స్వామివారు కోలుకున్నారు. ఈ సందర్భంగా నేరుగా కాకుండా దర్పణం ద్వారా భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. – ఇచ్ఛాపురం



హై'టెన్షన్'

కొండములగాం–అడపాపేట గ్రామాల మధ్య బుధవారం విద్యుత్ తీగలపై తాటిచెట్టు పడిపోయింది. హైటెన్షన్ విద్యుత్ వైర్లు కావడంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అనంతరం విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. – రణస్థలం

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న మధ్యాహ్న భోజన పథక కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జూలై 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, పాఠశాల స్వీపర్లు పాల్గొంటారని ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్, పాఠశాల, కళాశాలల స్వీపర్స్ యూనియన్ ప్రతినిధులు ప్రకటించారు. ఈ మేరకు డీఈఓ కార్యాలయం సూపరింటెండెంట్ వెంకటేశ్వర పట్నాయక్‌కు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఉత్తర, కె.సుశీల, నగర కార్యదర్శి టి.ప్రవీణ సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేబర్ కోడ్లను రద్దు చేయాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలని, మెనూ చార్జీలు పెంచాలని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎ.ఈశ్వరమ్మ, ఎ.మాలతి, చాందిని, ఎ.సుధారాణి పాల్గొన్నారు.

జాబ్‌మేళా రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని నెహ్రూ యువ కేంద్రం (ఆర్.టి.సి.కాంప్లెక్స్ వెనుక) వేదికగా శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరుణ్ మోటార్స్‌లో 25 రిలేషన్‌షిప్ మేనేజర్ల పోస్టులు భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ ఉత్తీర్ణులై 21 నుంచి 35ఏళ్ల వయస్సు కలిగిన పురుషులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.16,500జీతం, ఇన్సెంటివ్‌లు ఉంటాయన్నారు. 2 వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. శ్రీకాకుళం, పలాస, సోంపేట, టెక్కలి, రాజాం, పాతపట్నం, పాలకొండ ప్రాంతాల్లో పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఉదయం 10 బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

వారం వ్యవధిలో.. అక్కాచెల్లెళ్లు మృత్యువాత

- కడుపునొప్పి లక్షణాలతో బాధపడ్డారని చెబుతున్న కుటుంబ సభ్యులు
- గుండెనొప్పి కావచ్చంటున్న వైద్యులు
- తాళ్లగురంటిలో విషాదఛాయలు
- కానరాని వైద్య శిబిరాలు



నిఖిత, హారిక(ఫైల్)

మందస: వారం రోజుల వ్యవధిలో ఒకే కుటుంబంలోని అక్కాచెల్లెళ్లు మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు విషాదంలో మునిగిపోయారు. మందస మండలం తాళ్లగురంటి గ్రామానికి చెందిన తిలోచన్ జన్ని, బోగి జన్ని దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె నిఖిత(9) నాలుగో తరగతి కాగా, చిన్న కుమార్తె హారిక(7) రెండో తరగతి. ఇద్దరూ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోనే చదువుతున్నారు. నిఖితకు గత మంగళవారం(జూన్ 17) వేకువజామున 3 గంటల సమయంలో కడుపు నొప్పి రావడంతో తండ్రి సిరప్ తాగించాడు. అయినా ఫలితం లేకపోవడంతో ఉదయాన్నే మృతిచెందింది. సరిగ్గా వారం తర్వాత రెండో కుమార్తె హారిక కూడా మంగళవారం(ఈ నెల 24) వేకువజామున మూడు గంటల ప్రాంతంలో కడుపునొప్పితో బాధపడింది. ఈ పాపకు తండ్రి సిరప్ తాగించడంతో ఉదయాన్నే మృతిచెందింది. మరోవైపు, బాలికల చిన్నాన్న శంకర్ కూడా అస్వస్థతకు గురయ్యాడు. వింతగా ప్రవరిస్తుండటంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు.

ఆందోళనలో గ్రామస్తులు

వారం వ్యవధిలో ఇద్దరు మృతిచెందడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో మరికొందరు కూడా జ్వర లక్షణాలతో బాధపడుతున్నట్లు చెబుతున్నారు. అయినా ఇంతవరకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వైద్యులు స్పందించి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై సిరిపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సాయి వద్ద ప్రస్తావించగా.. మృతులకు జ్వర లక్షణాలు లేనట్లు గుర్తించామన్నారు. గుండె నొప్పితో చనిపోయి ఉంటుందని భావిస్తున్నామని చెప్పారు.



సమావేశానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు



సమావేశంలో పాల్గొన్న ధర్మాన కృష్ణదాస్, కుంభా రవిబాబు, సీదిరి అప్పలరాజు, నర్తు రామారావు, గొర్లె కిరణ్‌కుమార్, పేరాడ తిలక్ తదితరులు



పార్టీ అధినేత వైఎస్ జగన్‌తో ధర్మాన కృష్ణదాస్

ప్రజల్లోకి ప్రభుత్వ వ్యతిరేకత

- పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: జిల్లాలో పార్టీ బలంగా ఉందని, ఏడాది కూటమి పాలనపై వ్యక్తమైన వ్యతిరేకతను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తున్నామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహనరెడ్డికి తెలియజేశారు. తాడేపల్లిలో బుధవారం జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో అధినేతకు పార్టీ పరిస్థితిని వివరించారు. కూటమి పాలనపై ప్రజా వ్యతిరేకత పెరుగుతోందని, దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని, గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని, కార్యకర్తలకు అండగా ఉంటూ వారిలో మనోధైర్యం పెంపొందించాలని పార్టీ అధినేత సూచించినట్లు కృష్ణదాస్ వివరించారు. కార్యక్రమానికి హాజరైన వారిలో పార్టీ శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకుడు కుంభా రవిబాబు, ఎమ్మెల్సీ నర్తు రామారావు, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్, ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. బీసీ సెల్ అధ్యక్షుడిగా మార్పు అశోక్ చక్రవర్తి (టెక్కలి), పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా కాయ భీమసేన(ఇచ్ఛాపురం), వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడిగా దొప్పు రాము (ఎచ్చెర్ల), సోషల్ మీడియా విభాగం జిల్లా అధ్యక్షుడిగా బోర నర్సునాయుడిని పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించారు.

క్లుప్తంగా

పోలీసుల విచారణ


గుడి పరిసరాలు పరిశీలిస్తున్న పోలీసులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామ వంశధార నదీ తీరంలో కొలువైన బంగారమ్మ తల్లి గుడి వద్ద సరుబుజ్జిలి పోలీసులు బుధవారం విచారణ చేపట్టారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బంగారమ్మ గుడి వద్ద ఉన్న హుండీ పగలగొట్టి అందులో ఉన్న నగదు ఎత్తుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న సరుబుజ్జిలి ఎస్ఐ బి.హైమవతి సంఘటనా స్థలానికి పోలీసులను పంపించి సమగ్ర వివరాలను సేకరించారు. విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

● భర్త పరిస్థితి విషమం


రత్నాలమ్మ మృతదేహం

టెక్కలి: కోటబొమ్మాళి మండలంలోని తర్లిపేట సమీపంలో జాతీయ రహదారి వద్ద బుధవారం వేకువజామున గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో భార్య మృతి చెందగా, భర్త పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళ్తే.. తర్లిపేట గ్రామానికి చెందిన బుడత లోకేష్, భార్య రత్నాలమ్మ తదితరులు వేకువజామున తమకు చెందిన ట్రాలీ రిక్షాపై సారికందను శ్రీపురం జంక్షన్‌లోని కూరగాయల సముదాయం వద్దకు తీసుకెళ్తున్నారు. ఆ సమయంలో హఠాత్తుగా గుర్తు తెలియని వాహనం వచ్చి బలంగా ఢీకొంది. దీంతో ఇరువురు రోడ్డుపై పడిపోగా, సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇందులో రత్నాలమ్మ చికిత్స పొందుతూ మృతి చెందింది. లోకేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రానికి తరలించారు. ఘటనపై కోటబొమ్మాళి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జెమ్స్‌లో రోబోటిక్ శస్త్ర చికిత్స


రోబోటిక్ ద్వారా శస్త్ర చికిత్స చేసిన వైద్య బృందం

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో బుధవారం రోబోటిక్ శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు రోబోటిక్ సర్జన్ డాక్టర్ చీపురపల్లి వసుంధర తెలిపారు. జిల్లాలోని జలుమూరు మండలానికి చెందిన 46 ఏళ్ల మహిళ గర్భాశయ వ్యాధితో గత కొన్నేళ్లుగా బాధపడుతోంది. ఎన్నో మందులు వాడినప్పటికీ తగ్గకపోవడంతో జెమ్స్ ఆస్పత్రిని సంప్రదించింది. ఈమెను పరీక్షించిన వైద్యురాలు రోబోటిక్ సాయంతో విజయవంతంగా శస్త్ర చికిత్స పూర్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీ లలిత, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌రెడ్డి, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమంత్, హెచ్‌వోడీ డాక్టర్ రేవతి, గైనకాలజిస్ట్ డాక్టర్ స్నేహలు పాల్గొన్నారు.

కర్ణాటకకు చెందిన యువకుడు ఆత్మహత్య


సందీప్ (ఫైల్)

రణస్థలం: పైడి భీమవరంలోని ఒక ప్రైవేటు లాడ్జిలో కర్ణాటకకు చెందిన సర్వీస్ ఇంజినీర్ ఎంఆర్ సందీప్(25) ఆత్మహత్యకు పాల్పడినట్లు జేఆర్ పురం పోలీసులు తెలిపారు. పైడి భీమవరం డాక్టర్ రెడ్డీస్ పరిశ్రమలో సర్వీసింగ్ చేసేందుకు లోటస్ కంపెనీ నుంచి సర్వీస్ ఇంజినీరుగా సందీప్ ఈనెల 4వ తేదీన వచ్చాడు. విధులు నిర్వహిస్తూ పైడిభీమవరంలో ఒక లాడ్జిలో రూమ్ తీసుకుని ఉంటున్నాడు. మంగళవారం నుంచి లోటస్‌కు సంబంధించిన తోటి ఉద్యోగులు ఫోన్ చేస్తున్నా తీయడం లేదు. బుధవారం ప్రయత్నించగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. పైడి భీమవరం రెడ్డీస్ ఉద్యోగులకు విషయం చెప్పి లాడ్జికు పంపించారు. రూమ్ లోపల గడియపెట్టి ఉండడంతో లాడ్జి నిర్వాహకుల సాయంతో తలుపు తెరవగా, బాత్‌రూమ్‌లో ఆత్మహత్య చేసుకుని మృతి చెంది ఉన్నాడు. మృతుడిది కర్ణాటక రాష్ట్రం దేవన్‌గిరి సమీపంలోని భాన్‌వల్లి గ్రామంగా గుర్తించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.



పనులయ్యాయి.. ప్రారంభమెన్నడో..!

● వైఎస్సార్‌సీపీ హయాంలో పూర్తయిన జిల్లా ఔషధ నియంత్రణ పరిపాలన కార్యాలయం
● ఏడాది క్రితమే ఏడీకి అప్పగింత
● నేటికీ ప్రారంభమవ్వని వైనం



శ్రీకాకుళం క్రైమ్/శ్రీకాకుళం:

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలోని రిమ్స్ ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో నిర్మాణం పూర్తయిన జిల్లా ఔషధ నియంత్రణ సహాయ సంచాలకుడి కార్యాలయం నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. 2020లో ఈ భవన నిర్మాణం ప్రారంభించగా, 2024 ఎన్నికలకు ముందే నిర్మాణం పూర్తయ్యింది. కానీ ఏడాది క్రితం ఏర్పడిన కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం.. పరిపాలనా విభాగం తాత్సారంతో ఇప్పటికీ అద్దె భవనానికి నెలకు రూ.10,497లు చెల్లిస్తున్నారు.

రీ ఎస్టిమేట్ బిల్లులో జాప్యం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.81.60 లక్షలతో మొదట అంచనా వ్యయంగా బిల్లు మంజూరు చేసింది. దీంతో గడిచిన ఎన్నికల ముందే భవనం పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగింది. 2024 జూన్ 3న సంబంధిత శాఖ సహాయ సంచాలకుడు (ఏడీ) చంద్రరావుకు అప్పగించడమూ జరిగింది. అయితే కార్యాలయానికి విద్యుత్ సదుపాయం, చుట్టూ ఫెన్సింగ్ కోసం ముందుగా మంజూరు చేసిన నిధులు సరిపోలేదని అదనంగా రూ.12 లక్షల అంచనా వ్యయం కోసం కూటమి ప్రభుత్వానికి మళ్లీ ఏడీ ప్రతిపాదనలు పంపారు. దీంతో దాదాపు తొమ్మిది నెలల జాప్యం తర్వాత ఈ ఏడాది మార్చి 3వ తేదీన ప్రభుత్వం నుంచి రీఎస్టిమేట్ వ్యయం రూ.10.62 లక్షలు మంజూరైనట్లు ఉత్తర్వులు వచ్చాయి. అయినప్పటికీ నేటికీ విద్యుత్ సదుపాయం, ఫెన్సింగ్ పనులు పూర్తి చేయలేదు.

కొద్దిరోజుల్లోనే ప్రారంభిస్తాం



భవనం ప్రారంభంలో జాప్యం వాస్తవమే. విద్యుత్ సౌకర్యం లేకపోవడం, చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకు ముందు వచ్చిన నిధులు సరిపోకపోవడంతో మళ్లీ అంచనా వ్యయం నివేదికను సంబంధిత విద్యుత్ శాఖను సమన్వయం చేసుకుని ప్రభుత్వానికి పంపాం. మార్చిలో మంజూరైన నిధులపై సంబంధిత విద్యుత్ శాఖ ఏఈకి లెటర్ పెట్టాం. వారు ఏపీఎంఐఎస్‌డీకి సబ్మిట్ చేశారు. ఈనెల 20న హెల్త్ మినిస్టర్ విశాఖలోని జాయింట్ డైరెక్టర్ కార్యాలయంతో పాటు వర్చువల్‌గా ప్రారంభించాల్సి ఉన్నా, యోగాంధ్ర కార్యక్రమంతో వాయిదా పడింది. త్వరలోనే ప్రారంభిస్తాం. – చంద్రరావు, డ్రగ్ కంట్రోలర్ ఏడీ అండ్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్, శ్రీకాకుళం

ఒకేరోజు ప్రారంభించేందుకేనా..?

రాష్ట్రంలో సుమారు 10 నుంచి 12 చోట్ల ఇదే కార్యాలయ భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయి. అయితే శ్రీకాకుళంలోనే ముందుగా నిర్మాణం పూర్తవ్వడం జరిగింది. కానీ మిగతా ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో నిర్మాణాలు జరగకపోవడం కూడా ఇక్కడ భవనం ప్రారంభమవ్వకపోవడానికి ఒక్క కారణంగా తెలుస్తోంది. రాష్ట్ర వైద్యారోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి సత్యకుమార్‌యాదవ్‌తో ఒకే రోజు అన్ని భవనాలు ప్రారంభించాలని అనుకోవడం వలనే ఈ భవనం ఆలస్యానికి కారణమని సమాచారం. ఇదే భవనానికి సమీపంలో ఉన్న ఇండోర్ భవనం కూడా రూ.60 కోట్ల వ్యయంతో నిర్మితమై ఉన్నా ప్రారంభానికి నోచుకోకపోవడం కూటమి పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం.

ఐవీఆర్ఎస్ పర్సంటేజ్ తగ్గుదలపై క్షేత్ర పరిశీలన


బొరివంకలో ప్రజలతో మాట్లాడుతున్న సీఈవో శ్రీధర్ రాజా

కవిటి: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల అమలు తీరుపై గ్రామీణాభివృద్ధిశాఖ నిర్వహిస్తున్న ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం(ఐవీఆర్ఎస్) ఫోన్‌కాల్స్ శాతం తగ్గుదలపై రాష్ట్ర కమిషనరేట్ వివరణ కోరిందని శ్రీకాకుళం జెడ్పీ సీఈవో ఎల్ఎంవీ శ్రీధర్‌రాజా తెలియజేశారు. ఈ మేరకు బొరివంక సచివాలయం పరిధిలో బుధవారం ఆకస్మికంగా క్షేత్ర పర్యటన చేశారు. స్థానిక ప్రజలకు వచ్చే కాల్స్ శాతం జిల్లా సగటుకన్నా బాగా తక్కువగా నమోదు కావడంపై ప్రజలతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయనకు ఆసక్తికరమైన విషయాలు ప్రజలు తెలిపారు. ఫోన్‌కాల్స్ తీసుకుని స్పందించడానికి తమకు అటువంటి కాల్స్ రాలేదన్నారు. అంతేకాకుండా నెటవర్క్ సమస్యలు అధికంగా ఉన్నాయని వెల్లడించారు. మండలంలోని ఐదు సచివాలయాలు ఐవీఆర్ఎస్‌కు అనుసంధానం చేశామని డిప్యూటీ ఎంపీడీవో అబ్దుల్ ఖాన్ అన్నారు. అనంతరం బొరివంక, ఇద్దివానిపాలెంలో ఇంటింటికీ శ్రీధర్‌రాజా వెళ్లి ఐవీఆర్ఎస్ కాల్స్‌కు స్పందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలని ఉద్యోగులకు సూచించారు. సమావేశంలో ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ శ్రీరాంప్రసాద్, ఎంపీటీసీ దుద్ది సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే వర్సిటీ అభివృద్ధి

● వీసీ ఆచార్య కేఆర్ రజనీ
● ఘనంగా బీఆర్ఏయూ 18వ వ్యవస్థాపక దినోత్సవం


ప్రసంగిస్తున్న వర్సిటీ వీసీ కేఆర్ రజనీ

ఎచ్చెర్ల: అందరి సమష్టి కృషితోనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అభివృద్ధి జరుగుతోందని వర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజనీ అన్నారు. వర్సిటీ 18వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ వెనుకబడిన ప్రాంతంలో స్థాపించిన వర్సిటీ ప్రగతిలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యమయ్యేలా సంకల్పించుకోవాలన్నారు. వర్సిటీ ప్రతిష్టకు భంగం కలిగేలా ఎవరూ వ్యవహరించకూడదని సూచించారు. ఇటీవల విడుదలైన పీఎం ఉషా నిధులను వర్సిటీ బలోపేతానికి, మౌలిక వసతులు పెంచేందుకు, నూతన నిర్మాణాలకు వెచ్చించనున్నట్లు తెలిపారు. సిబ్బందికి ఎదైనా సమస్య ఉంటే తనకు నేరుగా తెలియజేయాలన్నారు. డిగ్రీ కళాశాలల అధ్యాపకులు పరీక్షలకు అబ్జర్వర్లను నియమించాలని అంటున్నారని, అయితే ఇన్విజిలేటర్ ఉండగా పరీక్షల్లో చూచిరాతలకు తావు ఉండదని పేర్కొన్నారు. తక్కువ బడ్జెట్‌లో పరీక్షలు నిర్వహించాల్సి ఉందని, అబ్జర్వర్లను నియమిస్తే అదనపు ఖర్చు అవుతుందని పేర్కొన్నారు.

వర్సిటీతో పేదలకు ఉన్నత విద్య

వర్సిటీ రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య మాట్లాడుతూ గిరిజన, పేద వర్గాలకు ఉన్నత విద్యనందించడంలో వర్సిటీ ముఖ్య భూమిక పోషిస్తోందన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత మాట్లాడుతూ గత 17 ఏళ్లలో వర్సిటీ సాధించిన విజయాలను వివరించారు. ప్రగతే ధ్యేయంగా పనిచేస్తున్న అధికారులు, వర్సిటీ వర్గాలు పరిపాలనా వ్యవస్థను దిగజార్చే పనులకు దూరంగా ఉండాలని సూచించారు. అయితే తనకు ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ శిష్యుడని, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు వద్ద మంచి పేరు ఉందని చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. కార్యక్రమంలో వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ డా.ఎ.ఉదయ్‌భాస్కర్, డా.ఎం.అనురాధ, డా.సీహెచ్ రాజశేఖరరావు, ఎన్.ఎస్.ఎస్ కో–ఆర్డినేటర్ డా.డి.వినజ, డా.కె.ఉదయ్‌కిరణ్‌లు ప్రసంగించారు. ఎస్‌వో డా.కె.సామ్రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు క్యాంపస్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వీఆర్ఏల సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రెవెన్యూ విభాగంలో కింది స్థాయిలో ఉన్న గ్రామ రెవెన్యూ సహాయకులను అధికారులు, ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని, వారి జాబ్‌చార్టులో లేని పనులు అప్పగించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఈ రకమైన సమస్యలు పరిష్కరించాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు అల్లు సత్యనారాయణ కోరారు. ఈ మేరకు గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం అధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. వీఆర్ఏలకు నైట్ డ్యూటీలు రద్దు చేయాలని, పేస్కేలు అమలు చేయాలని విన్నవించారు. నామినీలను వీఆర్ఏలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా నేటికీ తమకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష వైఖరి ప్రదర్శిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్ఏల సమస్యలు పరిష్కరించకుండా మంచి ప్రభుత్వం ఎలా అవుతుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

కనీస వేతనం అమలు చేయాలి

వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.త్రినాథరావు, కె.రమణమూర్తిలు మాట్లాడుతూ పార్ట్ టైం పేరుతో ఫుల్ టైం సేవలను ప్రభుత్వం ఉపయోగించుకుంటోందన్నారు. అయినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం లేదని, కనీస వేతనం అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 15 సంవత్సరాలుగా నామినీలుగా పనిచేస్తున్న వారితో సేవలను చేయించుకున్నప్పటికీ వీఆర్ఏలుగా గుర్తించకుండా వెట్టి చాకిరి చేయిస్తోందన్నారు. వారిని వెంటనే వీఆర్ఏలుగా గుర్తించాలని, డీఏతో కూడిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీఆర్వో, అటెండర్, వాచ్‌మెన్, డ్రైవర్ మొదలగు ఖాళీల్లో ప్రమోషన్లు 70 శాతం వీఆర్ఏలకు కేటాయించాలని, చట్ట విరుద్ధంగా చేయిస్తున్న నైట్ డ్యూటీలను ఆపాలని కోరారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన సంఘ నాయకులు, వీఆర్ఏలు కె.అప్పారావు, బి.రాములమ్మ, ఎన్.సీతప్పడు, జి.రామ్మూర్తి, లక్ష్మణరావు, జనార్దనరావు, బి.అప్పారావు, మీనాక్షి, రాజులమ్మ, పద్మ, ఎం.రాము, లోకనాథం, ఈశ్వరరావు, పోతయ్య, దాలప్పుడు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా కొత్తమ్మ తల్లి

కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి అమ్మవారు బుధవారం శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం తొలి గురువారం సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించినట్లు పూజారి రాజేష్ తెలిపారు. – టెక్కలి



గంజాయి నిర్మూలనపై స్పష్టమైన ప్రణాళిక

● డీఐజీ గోపినాథ్ జెట్టి


డీఐజీ గోపినాథ్ జెట్టి

శ్రీకాకుళం క్రైమ్: గంజాయి నిర్మూలన, నిందితుల అరెస్టు, వారి ఆస్తుల జప్తు, డీ–అడిక్షన్ సెంటర్లకు తరలింపుపై అధికారులకు స్పష్టమైన ప్రణాళిక ఉండాలని విశాఖ రేంజి డీఐజీ గోపినాథ్ జెట్టి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూలై 5న పాడేరులో జిల్లాస్థాయి అధికారులతో సమావేశం ఉంటుందని తెలియజేశారు. గడిచిన 2024–25లో గంజా అక్రమ రవాణాపై 694 కేసులు నమోదు చేసి 40,063 కిలోల గంజాయి, 18 కిలోల హనీష్ ఆయిల్, 478 వాహనాలను స్వాధీనం చేసుకొని 1,945 మందిని అరెస్టు చేశామని వెల్లడించారు. ఒడిశా రాష్ట్ర ఉన్నతాధికారులతో సమావేశాలు పెడుతున్నామని, 26 స్టాటిక్ చెక్ పోస్టుల వద్ద 183 కేసుల్లో 11,047 కిలోల గంజాయి సీజ్ చేసి 469 మందిని అరెస్టు చేశామన్నారు. అదనంగా ఉన్న 298 డైనమిక్ చెక్‌పోస్టుల వద్ద 237 కేసుల్లో 21,070 కిలోల గంజాయి సీజ్ చేసి 743 మందిని అరెస్టు చేశామన్నారు. రవాణా చేసే ఎనిమిది మంది వ్యాపారుల నుంచి రూ.9.76 కోట్ల ఆస్తులను జప్తు చేశామని, 1310 మంది గంజాయి నేరస్తుల కదలికల మీద నిఘా కోసం షీట్స్ తెరిచామన్నారు. 50 మందిపై పీడీ చట్టం, 19 మందిపై పీటీ ఎన్‌డీపీఎస్ చట్టం ప్రయోగించేందుకు ప్రతిపాదించామన్నారు. రవాణాలో పాల్గొన్న 527 మందిని, గంజాయితోపాటు ఇతర నేరాల్లో పాల్గొన్న 348 మందిని ఇప్పటికే గుర్తించామన్నారు. 2024–25 కాలంలో 23 కేసుల్లో 40 మంది ముద్దాయిలకు న్యాయస్థానం 10 నుంచి 20 సంవత్సరాల జైలు శిక్ష విధించిందని, 3039 విద్యాసంస్థలు మరియు అన్ని గ్రామాల్లో 10,654 అవగాహన సదస్సులు పెట్టామన్నారు. 51 మంది గంజాయి వినియోగదారులపై కేసులు పెట్టి 161 మందికి పునరావాస కేంద్రాలకు పంపామన్నారు. పాత కేసుల్లో పట్టుబడిన 72,196 కిలోల గంజాయిని, 74.26 కిలోల హనీష్ ఆయిల్‌ను ధ్వంసం చేశామని తెలియజేశారు.

ఇరాన్‌పై దాడులను ఖండించాలి


నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఇరాన్‌పై అమెరికా దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొన్న శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు వామపక్షాల ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత్ అవలంభిస్తున్న సంప్రదాయ విదేశాంగ విధానానికి అమెరికా దాడులు విరుద్ధమని దుయ్యబట్టారు. ఇరాన్‌పై దాడితో క్రూడ్ ఆయిల్ సంక్షోభం వస్తుందని, దేశ ప్రజలపై తీవ్రమైన భారాలు పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వం వెంటనే అమెరికా దాడులను ఖండించాలని డిమాండ్ చేశారు. ఇరాన్‌పై దాడులు అమెరికా స్వప్రయోజనాల కోసమేనని, ప్రపంచ ప్రజలు మూల్యం చెల్లించుకోవాల్సిన అవసరం లేదన్నారు. భారత్‌తో ఇరాన్ ఎల్లప్పుడూ స్నేహపూర్వకంగా వ్యవహరిస్తోందని గుర్తు చేశారు. ఈ దాడి ప్రపంచ శాంతి, సాధారణ ప్రజల జీవనోపాధిపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు ఆర్.ప్రకాశరావు, ఎ.సత్యం, ఎం.గోవర్ధనరావు, ఎం.ఆదినారాయణమూర్తి, టి.తిరుపతిరావు, ఎ.లక్ష్మి, బి.సంతోష్, ఆర్.అరవింద్, ఎ.సోమశేఖర్, పి.జగ్గారావు, పి.జనార్దనరావు, ఎస్.సంతోష్, ఎంపీ రమణ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నాటుసారాతో ఎక్సైజ్ సిబ్బంది

మందస: మండలంలోని గుడ్డికోలా గ్రామంలో గురివారి అనే మహిళ నుంచి 40 లీటర్ల నాటుసారా పట్టుకోవడంతో పాటు, సారా తయారీకి వినియోగిస్తున్న 300 లీటర్ల బెల్లంఊటను ఎక్సైజ్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. దీనిలో భాగంగా ఆమెను అరెస్టు చేసి సోంపేట కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారు. దాడుల్లో సోంపేట ఎక్సైజ్ సీఐ జీవీ రమణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సుజాత, సిబ్బంది భాను ప్రసాద్, రమణ, వెంకటేష్, ఉమాపతి, విజయ్, మార్కరావు, గాలిబ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్ష సాధింపు..?

● కోమర్తి సర్పంచ్ బంధువుల రేకుల షెడ్డు, గడ్డికుప్ప తొలగింపు
● రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నా పట్టించుకోని రెవెన్యూ సిబ్బంది


జేసీబీతో రేకుల షెడ్డు తొలగిస్తున్న దృశ్యం

నరసన్నపేట: మండలంలోని కోమర్తి పంచాయతీ సర్పంచ్ ఉంగటి చిన్నమ్ముడు అత్త, భర్తలకు చెందిన ఆస్తులను అధికార యంత్రాంగం బుధవారం తొలగించింది. గ్రామస్తులు ఫిర్యాదు చేశారనే నెపంతో రేకుల షెడ్డు, గడ్డికుప్పను తొలగించారు. దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉన్నాయని, గడిచిన 60 ఏళ్లగా తమ తాతల నుంచి ఈ స్థలాన్ని అనుభవిస్తున్నామని చూపించినా రెవెన్యూ సిబ్బంది పట్టించుకోలేదు. దీనికి కూటమికి చెందిన నాయకుల ఒత్తిడే దీనికి కారణమని సర్పంచ్ చిన్నమ్ముడు, ఆమె భర్త ఉంగటి రాజేశ్వరరావు, సర్పంచ్ అత్త ఉంగటి అప్పమ్మలు అన్నారు. రాజకీయ కక్షతోనే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ స్థలానికి సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయని, హద్దులు సక్రమంగా ఉన్నప్పటికీ ఇది ప్రభుత్వ భూమి అని తప్పుడు కొలతలు వేసి షెడ్డు తొలగించారని ఆరోపించారు. గడ్డికుప్ప వేసిన స్థలం కూడా తమదేనని వాపోయారు. కొంతమంది ప్రోద్బలంతో ఈ చర్యకు రెవెన్యూ సిబ్బంది పాల్పడ్డారని ఆవేదన చెందారు. దీనికి సంబంధించి ఆర్ఐ సాయిరాం మాట్లాడుతూ ఈ స్థలం కోమర్తిలోని ఎస్సీల కాలనీ కోసం ప్రభుత్వం సేకరించిన స్థలంగా రికార్డుల్లో ఉందని, దీనిపై గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు రాగా పరిశీలించి నోటీసులు ఇచ్చి తొలగించామని తెలిపారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత

కంచిలి: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్ఐ పి.పారినాయుడు, సిబ్బందితో కలిసి కంచిలి ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు.

దీనిలో భాగంగా ఒక పికప్ వాహనంలో 17 పశువులను అక్రమ రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. వీటిని రవాణా చేస్తున్న అరవ సరియాపల్లి గ్రామానికి చెందిన బొండాడ ఢిల్లీరావు, విశాఖ జిల్లా పాయకరావుపేటకు చెందిన శివకోటి కొండబాబు, కాకినాడ జిల్లా ఎస్.అన్నవరం మండలం నామవరం గ్రామానికి చెందిన సలా దుర్గాప్రసాద్, కవిటి మండలం గొర్లెపాడు గ్రామానికి చెందిన బిర్ల లింగయ్యలపై కేసు నమోదు చేశారు.

విత్తన శుద్ధి.. సాగు వృద్ధి

● ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న రైతులు
● విత్తన శుద్ధిపై అధికారుల సూచనలు

ఆమదాలవలస:

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న రైతులు తమ పంట పొలాల్లో జల్లే వరి విత్తనాలకు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. రైతులు ఎంపిక చేసుకున్న విత్తనాలకు విత్తన శుద్ధి చేసి పొలాల్లో వెద, నారుమడుల్లో వేస్తే అధిక దిగుబడులు సాధించుకోవచ్చునని చెబుతున్నారు. విత్తన శుద్ధి సాగులో చీడపీడల నివారణకు ఎంతగానో ఉపయోగపడుతుందని గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 1.70 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో వరిసాగుకు రైతులు సిద్ధమవుతున్నారు.


విత్తన శుద్ధి చేస్తున్న రైతులు

విత్తన శుద్ధి చేసుకోవడం ఇలా...

కిలో విత్తనానికి ఒక గ్రాము కార్బండిజమ్ లేదా 2.5 గ్రాముల మాంకోజెట్ కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి. విత్తన శుద్ధిలో తగిన మోతాదులో మందులు వాడాలి. మోతాదు మించితే విత్తనం మొలకశాతం తగ్గుతుంది. శిలీంధ్ర నాశిని పురుగు మందులతో శుద్ధి చేసిన తర్వాత జీవ రసాయనాలతో మరోసారి శుద్ధి చేయాలి. గింజ పగలకుండా, పైపొర పోకుండా చూసుకోవాలి. చేతులకు గ్లౌజులు, ముఖానికి గుడ్డ కట్టుకోవాలి.

ప్రయోజనాలివే..

విత్తన శుద్ధి నేల ద్వారా వ్యాపించే తెగుళ్ల, పురుగును సమర్థవంతంగా నివారించడానికి దోహదపడుతుంది. శుద్ధికి వినియోగించే మందులు విత్తనంలోకి చొచ్చుకుపోయి శిలీంధ్రాలను నాశనం చేస్తాయి. మొలకెత్తిన లేత మొక్కలు నేలలో ఉన్న శిలీంధ్రాలు నుంచి రక్షణ పొందుతాయి. తక్కువ ఖర్చుతో పురుగులు, తెగుళ్లు పంటను ఆశించకుండా చేయవచ్చు.

సూచనలు పాటించాలి



రైతులంతా శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తే వ్యవసాయం ఎప్పటికీ లాభదాయకం అవుతుంది. ప్రస్తుతం రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రైతు భరోసా కేంద్రాల నుంచే అందుతున్నాయి. రైతులు మట్టి పరీక్షలు నిర్వహించి వాటికి అనుగుణంగా ఎరువులు వేసుకుంటే దిగుబడులు సాధించుకోవచ్చును. రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. – మోహనరావు, వ్యవసాయాధికారి, ఆమదాలవలస